# దాసోహం

"ఒరేయ్ హరీ ! త్వరగా గంగచెంబు పగలగొట్టరా !"

చెవులదగ్గర వినిపించిన కేకతో, కొద్దిగా మగత తొలగింది సీతారామయ్యకు. మెల్లిగా కళ్ళు తెరచి చూడ బోయాడు. తెరిపిడి పడ లేదు,

"ఆ కేక వేసిందెవరు ? విధవ చెల్లెలు మహాలక్ష్మమ్మ కదూ ?" అనుకున్నాడు. అంతలోనే తెరలు తెరలుగా ఏవో దృశ్యాలు మెదిలాయి మనసులో. తన తలిదండ్రులు అర చేతుల్లో పెట్టుక పెంచిన మహాలక్ష్మి కలవారియింటి కోడ లయిందేగాని, దేవుడు చిన్నచూపు చూడటంతో, పెళ్ళయిన ఆరునెలలకే విధవగా తిరిగీ తమ ఇంట ప్రవేశించింది. చెల్లెలు పుట్టింటికి రావటమూ. తన భార్య శ్రీదేవి మెట్టినింట పాదం పెట్టడమూ ఒక్క నెల తేడాలో జరిగాయి. ఓహ్! ఆనాటి నుంచీ ఈనాటివరకూ, మహాలక్ష్మి తన ఇంటికీ, భార్యాపిల్ల లకూ చాకిరీ చెయ్యటంతో, చివాట్లు తినటంతోనే బ్రతుకు వెళ్ళమార్చుకుంటోంది. ఇప్పుడు తను శాశ్వతంగా వెళ్ళి పోబోతున్నాడు. ఇక మహాలక్ష్మి గతేమిటి? తనలానే మహాలక్ష్మి రెండుమూడేళ్ళు మంచంలో పడితే, దాని కెవరు చేస్తారు? భర్తా? పిల్లలా? ఎవరున్నారు గనక !

సీతారామయ్యకు ఏదో తెర అడ్డొచ్చింది... బాధతో గట్టిగా మూలిగాడు.

"ఒరేయ్ వాసూ? అలా నిల్చుంటావేంరా? ఆ గంగలో కాసిన్ని తులసిదళాలు వెయ్యరా! ఉద్ధరిణె పట్టుకు రావే అలివేలూ!

మళ్లీ కల చెదిరినట్లయ్యింది సీతారామయ్యకు. ఎక్కడో దూరాన్నించి వినిపిస్తున్నట్లున్న ఆ కంఠస్వరం ఎవరిదో గుర్తు రావటం లేదు. "ఎవరు?" అనబోయాడు. పెదవులు విడివడటం లేదు. ఏదో బలవత్తర శక్తి తన దవడలు నొక్కేస్తోంది. పళ్ళు బిగుసుకుంటున్నాయి. నాలుక లోపలికి గుంజేస్తోంది.

"వాడు... పుండరీకాక్షం కాబోలు. అవును వాడి గొంతే! పీడితాడు తెగ! బ్రతికినంత కాలం, అన్నననే ధ్యాసేనా లేకుండా, వ్యాజ్యమాడాడు! ఇద్దరం పంతాలతో, ఉన్న ఆస్తంతా కోర్టులపాలు చేశాం! నా చావు కళ్ళారా చూద్దామని కాబోలు వచ్చాడు!" కోపంతో పిడికెళ్ళు బిగబట్టి లేవబోయాయి. వెన్నెముక మంచానికి అతుక్కుపోయినట్లుంది. బిగబట్టిన పిడికెళ్ళు విప్పటానికి సాధ్యపడటం లేదు!

"అయ్యో! దేవుడా! నాకికదిక్కెవరోయ్!" గుండెలు పగిలే ఆర్తనాదం!

"శ్రీదేవీ! ఏడవకే! మహాలక్ష్మి చూడు! దిక్కులేని దది! కొడుకులూ కోడళ్ళూ వున్న నువ్వే ఇలా ఏడిస్తే, ఇక అదెలా ముత్తుకోవాలి?" భార్య తలమీద చెయ్యివేసి ఆప్యా

యంగా నిమరాలనీ, ధైర్యం చెప్పాలనీ, మరింకేవో హిత బోధలు చెయ్యాలనీ క్షణకాలం ఊగిపోయింది మనస్సు! అంతలోనే శరీరం తేలికై పోతున్నట్లు అనుభూతి ప్రారంభ మయింది. కాలివ్రేళ్ళలో నుంచీ, చేతివేళ్ళ చివరల నుంచీ, ఏదో అంతుతెలియని బాధ, చల్లగా రేగి, మెల్లిగా ప్రాకి నాభి దగ్గర కేంద్రీకృతమౌతోంది! ఒకసారి గాఢాంధ కారం, మరోమారు దుస్సహమైన వెలుగూ, ఒకదానివెంట మరొకటిగా అలుముకుంటున్నాయి. హఠాత్తుగా శూన్యం లోకి ఎగురవేసినట్లు, ఎవరెవరో పరిచితులూ, అపరిచితులూ గజిబిజిగా కనిపిస్తున్నారు!

"ఒరేయ్ వాసూ! హరీ! అలివేలూ! అందరూ రండర్రా త్వరగా! తలో ఉద్ధరిణెడు గంగా ఆయన నోట్లో పొయ్యండిరా! చివరిగంగ ఎవరిచేతికి ప్రాప్తముందో?"

గోలగోలగా అరుస్తున్నారు! గంగ! జలజలపారే గంగ! ఒడ్డున్నే కాలుతున్న శవాలు! కమురువాసన! కొద్ది దూరంలో కన్పిస్తున్న విశ్వనాథుని ఆలయం! కాశీ... వారణాశి... అదే... అదే...!

"కనిపించీ కనిపించని దృశ్యాలు కట్టెదుట సాక్షాత్క రిస్తున్నాడు. గంగలో మునుగుదాం రండి సీతాపతిగారూ!" కండువా నడుముకు బిగించి, జందెం బిర్రుగా దూముడి వేసు కుంటూ అరిచాడు గంగాధరం.

"అబ్బబ్బ! నావల్లకాదండీ బాబూ! ఈ ఛండాలంలో మునకలువేసి పాపం పోగొట్టుకోనే మాటెలావున్నా, నానా

మకిలీ ఒంటిమీాదకు తెచ్చుకుంటాం! ఆ ఎముకలూ, ఆ కాలీ కాలని శవాలూ, రామరామ! ఇదా కాశీ? దీనికోసమా జనం వాపోతూ పరుగులుతీస్తారు?'' అన్నాడు గట్టునే్న నిల బడివున్న తను కండువాతో ముక్కులు మూసుకుంటూ!

“అలా అనకండి! అపరాధం. లెంపలు వేసుకోండి! విశ్వానికి నాథు డీ విశ్వనాథుడు! సర్వ జీవకోటికీ అన్న ప్రదాత్రి ఈ తల్లి అన్నపూర్ణ! దిగంబరుడూ, స్మశానవాసీ, కపాలధరుడూ అయిన ఈ విశ్వనాథునికి నిరంతరం శవధూపం వుండాలి! అందుకే, ప్రక్కన పవిత్ర గంగ, ఆ ప్రక్కనే్న శవదహనం, అటుప్రక్కన తన ఆలయం నిర్మించుకున్నాడు తండ్రి!

గంగాధరం, తన బదులు కూడా లెంపలు టపటప వాయించుకుంటూ, ''హరహర మహాదేవ శంభో!'' అంటూ బుడుక్కున మునిగాడు!

''శివ! శివా! ఇలాంటి ఛాందసు లుండబట్టే, పుణ్య క్షేత్రాలలో నిలువు దోపిడీ ఎక్కువయ్యింది!'' పొట్ట చెక్క లయ్యేలా నవ్వాడు తనారోజు!

నాభిదగ్గర బాధ, జ్వాలగా రూపొందుతోంది! అది మెల్లిగా అణువణువూ ఆక్రమించుకొంటోంది. పాములా మెలి కలు తిరుగుతూ, బుసబుస పొంగుతూ. గొంతువరకూ ఎగసి, గిరగిర తిరుగుతూ, గురగుర శబ్దం చేస్తోంది!

“ప్రాణం గొంతుకలో కొట్టుకలాడ్తోంది. కొందరికి డబ్బుమీాద కాపీనం వుంటే, రూపాయినాణేలు కడిగి, ఆ నీళ్ళు

గొంతుకలో పోసేవరకూ ప్రాణం పోదుట! పోసీ, నాలుగు రూపాయ నాణేలు కడిగి పొయ్యండర్రా!" ఎవరో అరుస్తున్నారు!

డబ్బు! కాసీనం! ఎన్ని అన్యాయాలు చేసి, ఎందర్ని వంచించి, ఎంతటి నీచాలకో వడిగట్టి, సంపాదించిన డబ్బు. అంతా తమ్ముడితో వ్యాజ్యంలో ఎగిరి పోయింది! ఎకరా పొలంకోసం. ఏడేళ్ళు కోర్టుల చుట్టూరా తిరిగి, స్వార్జితం కూడా కలిపి మరీ ధారపోశాడు తను!

"గుడ్లు తిరిగి తిరిగి, కళ్ళు తెరుస్తాడేమో? ఆ వెంకటేశ్వరస్వామి ఫోటో కళ్ళముందు పెట్టండి! చెవిలో నారాయణ! నారాయణ! అనండి......" ఎవరో సలహా ఇస్తున్నారు...

వెంకటేశ్వరుడు...తిరుపతి దేవుడు! ఏడు కొండల మీద వెలసిన లీలామానుష విగ్రహుడు!

ఏడుకొండలమీదికి వెళ్ళి. ఆలయం ప్రక్కన ఇంట్లో బసచేసి...

"ఈరోజు స్వామివారినేత్రదర్శనం! వెళ్ళిచూచొద్దాం!" అంటున్న సుభద్రమ్మ మాటలకు నవ్వేశాడు తను!

"హూఁ! నేత్ర దర్శనం ఎప్పుడయినా చెయ్యొచ్చులే! మీ ఆయన వూరినుంచి తిరిగి వచ్చినా, నా కిక్కడ పనయిపోయి, నే వూరికెళ్ళిపోయినా, . మనిద్దరికీ మిగిలేది, గోవింద నామస్మరణా, స్వామి నేత్రదర్శనమేగా?" అన్నాడు తను సుభద్రమ్మను దగ్గరికి లాక్కుంటూ!

"ఎవరేనా చూస్తే? దేవుడిదగ్గరే ఇలాటి పాపాలు?" వారించకుండానే, మెత్తగా మందలించింది సుభద్ర!

"పాపాలూ! నా పిండాకూడూ! అవన్నీ మనం చచ్చాక తీరిగ్గా మాట్లాడుకుందాం! ఆ 'ఖూ్యలో' నలిగి చచ్చి, ఉక్కపోసి యాతనపడి, అక్కడ చూచే నేత్రాలకంటే, నీ కళ్లెంత బాగుంటాయో నీకేం తెలుసు? నూటపదకొండూ బై ఒకటిలా వుండే ఆ పంగనామాల దేవుడికంటే, ఈ నా దేవత ముఖం ఎంత బావుందీ!"

నూటపదకొండూ బై ఒకటి... పంగనామాలు... నేత్రాలూ...

ఇందాకా ఎంత ప్రయత్నించినా కదలని శరీరం ఎగురుతున్నట్లుంది. కొద్దిగా రెప్పలు, వాటంతటవే విడివడుతున్నాయి! రెండు కళ్ళలోనుంచి రెండే రెండు సన్నని వెలుగు రేఖలు బయల్దేరి, నాసాగ్రంలో కలుసుకొని, జివ్వున పైకెగసి, భ్రుకుటి మధ్య జిగేలుమందో వెలుగు! ఆ వెలుగులో రకరకాల ఆకారాలూ. గిరగిర తిరుగుతున్నాయి వలయాకారంలో! భార్య, చెల్లెలు. తమ్ముడు, కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, స్నేహితులూ, డబ్బూ, పాపాలు...

ఎవరూ దగ్గరసా రావటం లేదు తనకు! నరాలు పిండుతున్నట్లున్న ఈ బాధను పంచుకోవటంలేదు! అందరూ తనను తప్పుకొ దూరంగా పరుగెత్తుతున్నారు!

"అయ్యో! మంచంమీద ప్రాణం పోగూడదట్రా! చప్పున నేలమీద దించిపెట్టెయ్యండి!"

నేలమీద...నేలలోపలికి ... మట్టిలోకి వెళ్ళిపోతు న్నాడు తను! కాదు కాదు! నేలమీదినుంచి, నింగిలోకి మరో లోకానికి...

"అకటి వేళల అలుసైన వేళల

ప్రాకట హరినామమే, మరి లేదు దిక్కు..."

ఎవరో శ్రావ్యంగా పాడుతున్నారు...మునక వెయ్యటానికి మనస్కరించని కాశీగంగ గొంతుక దిగుతోంది! చూడదగవని త్రోసిపుచ్చిన నేత్రాలు కనిపిస్తున్నాయి! నూటపదకొండూ పై ఒకటి...నామాలు...

మెల్లిగా భ్రుకుటి మధ్య వెలుగు మందగిస్తోంది! కాదు వృద్ధి అవుతోంది! భరింపలేనంత వెలుగు!

ఏమీ కనిపించటంలేదు! మరేమీ వినిపించటంలేదు.. శవాలు... గంగ... విశ్వనాథుడు... పంగనామాలు... నేత్రాలు... దివికీ భువికీ నిండిపోతున్నాయి! సకలచరాచర జగత్తునూ ముంచివేస్తున్నాయి!

"భగవాన్! చెయ్యరాని పనులెన్నో చేశాను! చెప్ప రాని మాటలు పలికాను! కాలిగోరు మొదలు తలవెంట్రుక లవరకూ 'అహం' పెంచుకున్నాను.

కానీ ఈ క్షణం తెలుస్తోంది... అన్నీ మిథ్య! నువ్వే నిత్యం...నువ్వే సత్యం... ఈ బంధాలూ, అనుబంధాలూ క్షణికాలు... కేవలం జీవి పెంచుకునే 'అహం!' అంతే! ఈ

క్షణమే 'అహం' వదులుతున్నాను... నీ దాసుణ్ణవుతున్నాను...''

సీతారామయ్య గాజుకళ్ళలో మెరుపులాటి ఒక్క వెలుగు... రెండే రెండు నీటి బిందువులూ తళుక్కుమన్నాయి క్షణకాలం...

"భగవాన్ ! దాసోహం !'' అందాకా బిగుసుకుని వున్న పెదవులకు ఎక్కడలేని చలనం వచ్చింది ! కట్టెల్లా వున్న చేతులు జోడించటానికి లేచి, పొట్టమీద పెనవేసుక నీలుక్కుపోయాయి !

''అయ్యో దాహం అంటున్నాడ్రా! మరో ఉద్ధరిణెడు గంగో, ఆయన కేది ఇష్టమో, ఆ పానీయమో గొంతులో పొయ్యండి..''

నోటిలో పోసిన గంగ గొంతుకలోకి దిగలేదు ! నాభి దగ్గర్నుంచి ఎగసిన జ్వాల, గొంతుకలోని గురగురను ఛేదించుకుని, అనంత విశ్వంలోనికి చొచ్చుకొనిపోవటం, ఎవరికీ కనిపించలేదు . . . వినిపించలేదు.